నెరవేరని లక్ష్యం.!



సైన్స్ ఎగ్జిబిషన్స్ కోసం హాల్

- చిల్డ్రన్స్ ఎరీనాలో కానరాని పిల్లల వినోదం
- చిన్నారుల ఆడిటోరియంలో పెద్దల కార్యక్రమాలు
- వినోదం వద్దు.. విజ్ఞానమైనా అందించాలని ప్రజల వినతి



చిల్డ్రన్స్ ఎరీనా (ఇన్‌సెట్) చిల్డ్రన్స్ ఎరీనాలో థియేటర్

బీచ్ రోడ్డు: పిల్లలకు వినోదం, విజ్ఞానం అందించాలనే లక్ష్యంతో రూ.16 కోట్ల వ్యయంతో ఆధునికీకరించిన వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనా పెద్దల కార్యక్రమాలకు వేదికగా మారింది. ఏ లక్ష్యంతోనైతే నిర్మించారో అది నీరుగారిపోయింది. బర్త్ డే పంక్షన్‌లు, పెళ్లి విందులు, సినిమా, ఆధ్యాత్మిక వేడుకలు, ఆఫ్ సారీ ఫంక్షన్లకు సిరిపురంలోని చిల్డ్రన్స్ ఎరీనా నిలయంగా మారిందని నగరవాసులు మండిపడుతున్నారు.

రూ.16 కోట్లతో ఆధునికీకరణ

చిన్నారులు, విద్యార్థుల్లో దేశభక్తి కలిగించే సినిమాలు, సమాజంపై బాధ్యత పెంచే చిత్రాల ప్రదర్శనతో పాటు విజ్ఞానం అందించే సైన్స్ ఎగ్జిబిషన్ల నిర్వహణ కోసం చిల్డ్రన్ ఎరీనాను వీఎంఆర్‌డీఏ సిరిపురంలో నిర్మించింది. ఎరీనా ఆధునికీకరణ పనులను 2012లో చేపట్టారు. 2018 నాటికి రూ.16 కోట్ల వ్యయంతో పనులను పూర్తి చేసి ఎరీనాను ఘనంగా ప్రారంభించారు. 600 సీట్లతో 4కే టెక్నాలజీతో థియేటర్‌ను రూపొందించగా.. కింద ఫ్లోర్‌లో ఎగ్జిబిషన్ హాల్‌ను నిర్మించారు. దేశంలోనే ప్రసిద్ధి పొందిన ఎరీనాలో వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనా రెండోదిగా రికార్డుకు ఎక్కింది. ఈ ప్రాధాన్యం ఉన్న ఈ వేదికపై గత ఏడేళ్లలో ఏడు చిత్రాలను కూడా ప్రదర్శించిన దాఖలాలు లేవు. 2018లో చిల్డ్రన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఏర్పాటు చేసినా.. సాంకేతిక కారణాలతో ఆ ఫెస్టివల్ విజయవంతం కాలేదు. ఆ తరువాత అటువంటి వేడుకలు నిర్వహించలేదు.

కానరాని విజ్ఞాన ప్రదర్శన

ఎరీనా ఆధునికీకరణ తరువాత విద్యార్థులకు విజ్ఞానం అందించే సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. మొదట్లో ప్రైవేటు సంస్థలు అప్పుడప్పుడు విద్యార్థులకు పోటీలను నిర్వహించడం మినహా.. వీఎంఆర్‌డీఏ తరఫున ఎటువంటి ప్రదర్శనలు ఏర్పాటు చేయలేదు.

రెండేళ్లకే వేసవి శిక్షణ తరగతులకు స్వస్తి

వీఎంఆర్‌డీఏ ఆధునికీకరణ అనంతరం రెండేళ్ల పాటు చిన్నారులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆ తరువాత వాటికి కూడా స్వస్తి పలికేశారు. ఇప్పుడు వేసవి శిక్షణ తరగతుల జోలికి వీఎంఆర్‌డీఏ పోవడం లేదు. దీంతో చిన్నారులు ప్రైవేటు సంస్థలు ఏర్పాటు చేసే వేసవి శిక్షణ తరగతులకు రూ.వేలు ఖర్చు చేసి చేరుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. చిల్డ్రన్ ఎరీనాలో వీఎంఆర్‌డీఏ పెద్దల కార్యక్రమాలకే అధిక ప్రాధాన్యత ఇచ్చింది. ఇప్పటికైనా వినోదం కాకపోయినా.. విజ్ఞానం అందించే సైన్స్ ఎగ్జిబిషన్స్ వంటివి ఏర్పాటు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం..



వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో చిన్నారుల కోసం చిత్రాల ప్రదర్శన, సైన్స్ ఎగ్జిబిషన్స్ ఏర్పాటుపై తల్లిదండ్రుల నుంచి అనేక వినతులు వస్తున్నాయి. వీటిపై కమిషన్ తరఫున కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. చిన్నారులకు వినోదం, విజ్ఞానం అందించేందుకు కృషి చేస్తాం.

– గొండు సీతారాం, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు

ఘనంగా కనకదుర్గమాంబ పండగ



కనకదుర్గమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వెలగపూడి

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోట శ్రీకనకదుర్గమాంబ అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. శ్రీకృష్ణా ఉమామహేశ్వరసాయి దుర్గా యాదవ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన వార్షిక పండగలో భాగంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచి బారులు తీరారు. విశేష పూజల అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేటర్ మొల్లి లక్ష్మి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యుద్దీపాలకరణతో ఇసుకతోట గ్రామం కనువిందుగా దర్శనమిచ్చింది. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు గొలగాని రాము, ప్రసాదులు పోలారావు, అధ్యక్షుడు ఈగల శివ గోవింద్, ఉపాధ్యక్షుడు పల్లా అప్పారావు, మాజీ అధ్యక్షుడు బొట్ట శివ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీటీడీ ఈవోకు అభినందన



ఈవో శ్యామలరావుకు బ్రహ్మోత్సవ వస్త్రం, ప్రసాదం అందజేస్తున్న కార్తీక దీపోత్సవ కమిటీ సభ్యులు

ఎంవీపీ కాలనీ: నగరానికి చెందిన విశాఖ సాగర తీర కార్తీక దీపోత్సవం కమిటీ సభ్యులు టీటీడీ ఈవో శ్యామలరావుకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు కమిటీ ప్రతినిధి హిమాన్షు ప్రసాద్ తదితరులు తిరుపతిలో శ్యామలరావును కలిసి బ్రహ్మోత్సవ వస్త్రం, ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన దాతలు, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ డైరెక్టర్స్ పొట్టి వెంకటేశ్వర్లు, రాజమౌళి 90 వేల బ్రిటానియా బిస్కెట్స్‌ను తిరుమలలో క్యూలైన్ భక్తులకు పంపిణీ చేసేందుకు అనుమతి కోరగా.. ఈవో అంగీకరించారు. ఈ సందర్భంగా శ్రీవారికి వివిధ రకాలుగా సేవలు అందిస్తున్న విశాఖ సాగరతీర కార్తీక దీపోత్సవ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు.

విశాఖ అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషిస్తా..

- అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ వెల్లడి
- ఘనంగా సత్కరించిన విశాఖ జిల్లా బీజేపీ శ్రేణులు



సీఎం రమేష్‌ను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

ఎంవీపీ కాలనీ: విశాఖతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించనున్నట్లు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ వెల్లడించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయన అనకాపల్లి ఎంపీగా విజయం సాధించిన నేపథ్యంలో విశాఖ జిల్లా బీజేపీ నాయకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అధ్యక్షతన ఈ సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ రమేష్ మాట్లాడుతూ విశాఖ నుంచి ఎంపీ బరిలో దిగాలని ఆశించినా పార్టీ పెద్దల ఆదేశాల మేరకు అనకాపల్లి నుంచి పోటీ చేసినట్టు చెప్పారు. విశాఖ రైల్వే జోన్ పనులు వేగంగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్రలో చేసిన అక్రమాలపై విచారణ జరిపిస్తామన్నారు. రుషికొండపై 10 ఎకరాల్లో విలాసవంతమైన కట్టడం ప్రజాధన దుర్వినియోగం చేయడమే అవుతుందన్నారు. పేద ప్రజలకు సెంటు భూమి ఇంటి స్థలంగా ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన విలాసానికి ఇంతలా ప్రజాధనం దుర్వినియోగం చేయడమేంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నోరూరిస్తున్న నేరేడు పండ్లు



తోపుడుబండ్లలో నేరేడు పండ్ల విక్రయాలు

మద్దిలపాలెం : నేరేడు పండ్లు నగర వాసులకు నోరూరిస్తున్నాయి. ప్రధాన రహదారి, కూడళ్లలో తాజా నేరేడు పండ్లను తోపుడు బండ్లపై పెట్టి విక్రయాలు చేస్తున్నారు. ఈ ఫలాలు ప్రతి ఏడాది జూన్, జూలై మాసాల్లో మాత్రమే లభిస్తాయి. ప్రస్తుతం రాయగడ నుంచి నేరేడు పండ్లను దిగుమతి చేసుకుంటున్నట్టు వ్యాపారులు తెలిపారు. మరో 15 రోజుల్లో మదనపల్లి నుంచి దిగుమతి ప్రారంభమవుతుందన్నారు. కిలో నేరేడు పండ్లు రూ.240 చొప్పున విక్రయిస్తున్నామన్నారు. అర కిలోకి సుమారు 30 నుంచి 35 పండ్లు తూగుతాయని చెప్పారు. ఈ పండ్లు ఆరోగ్యానికి చాలా మంచివని వైద్యులు సూచిస్తున్నారు.

సిరులతల్లికి అష్టదళపద్మారాధన



అష్టదళ పద్మారాధనలో అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కేకే శిరీష

తాటిచెట్లపాలెం: గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలందిస్తున్న ఆర్‌ఎంపీలకు మంగళవారం రైల్వేన్యూకాలనీలోని అక్షయ హాస్పటల్‌లో అవగాహన నిర్వహించారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో అక్షయ హాస్పటల్ ఎండీ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ హాస్పటల్‌లో అన్ని సదుపాయాలు ఉన్నాయని, నాణ్యమైన వైద్య సేవలను పేదలకు అందించడమే తమ ధ్యేయమని, వారి పరిధిలో ఉన్న పేదలకు వైద్య సేవల కోసం తమ ఆస్పత్రిని వినియోగించుకోవాలని కోరారు. సదస్సులో పాల్గొన్న గైనకాలజిస్ట్ డాక్టర్ కేకే శిరీష, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ భావన, ఆర్థోపెడీషియన్ డాక్టర్ వర్మలు వివిధ అంశాల్లో అవగాహన కల్పించారు. సంఘం అధ్యక్షుడు జంగం జోషి, జోనల్ గౌరవాధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, సలహాదారు కోన ప్రకాష్, ప్రధాన కార్యదర్శి సుగుణేశ్వరి, విజయనగరం జిల్లా అధ్యక్షుడు చిరంజీవి కనకారావు, పడాల కోటి, లోగిశ గణేష్‌లతో పాటు గాజువాక, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్‌ఎంపీ పాల్గొన్నారు.

మందుబాబులకు రూ.71,500 జరిమానా

పీఎం పాలెం : మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారికి న్యాయస్థానం రూ.71,500 జరిమానా విధించింది. పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ వెంకటరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కారుషెడ్ కూడలి, కొమ్మాది, మారికవలస కూడళ్లలో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 42 మంది పోలీసులకు చిక్కడంతో వారిపై కేసులు నమోదు చేశారు. వారిని మంగళవారం న్యాయమూర్తి ముందు హాజరు పరచగా ఒక్కొక్కరికీ రూ.1500 నుంచి రూ.3 వేల వరకూ జరిమానా విధించారని ఎస్‌ఐ తెలిపారు.

అసభ్య ప్రసంగాలను ప్రతిఘటించండి



గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న ఆచార్య వి.బాలమోహన్‌దాస్

సీతంపేట: అసభ్య ప్రసంగాలను ప్రతిఘటించండి అంటూ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ సంస్థ పిలుపు నిచ్చింది. ఈమేరకు బుల్లయ్య కళాశాల గాంధీ సెంటర్‌లో సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిని జాగృతం చేసే బదులు జాతి ఐక్యతకు భంగం కలిగేలా ప్రసంగాలు ఉంటున్నాయని అది ఎంతమాత్రం క్షేమకరం కాదన్నారు. ఐక్యరాజ్యసమితి ఏటా జూన్18న అంతర్జాతీయ అసభ్య ప్రసంగాల ప్రతి ఘటనా దినంగా ప్రకటించిందని గుర్తుచేశారు. పీస్ అండ్ హార్మోనీ సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ప్రజలను జాగృతం చెయ్యాలనే సంకల్పంతో ఈ నెల 23న ఉదయం 10 గంటలకు బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యావేత్తలు, మతపెద్దలు పాల్గొని తమ అభిప్రాయాలు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞాన్‌కుమార్, అబ్దుల్ మునీర్, సత్యమూర్తి పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు 100 రోజుల ప్రణాళిక

- డీసీపీ మోకా సత్తిబాబు
- గంజాయి ప్రభావిత ప్రాంతాలపై నిఘా
- కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు



వెస్ట్ ఏసీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ మోకా సత్తిబాబు

గోపాలపట్నం: గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు 100 రోజుల ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని డీసీపీ మోకా సత్తిబాబు చెప్పారు. విశాఖను డ్రగ్స్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మంగళవారం సాయంత్రం వెస్ట్ సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు.

రాష్ట్ర హోం మంత్రి అనిత, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, విశాఖ పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు విశాఖ జోన్–2 పరిధిలో గంజాయి, డ్రగ్స్‌ను సమూలంగా నిర్మూలిస్తామని తెలిపారు. ఇందుకు కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లనున్నట్టు వెల్లడించారు. డ్రగ్స్, గంజాయి ప్రభావిత ప్రాంతాలు.. లభ్యమవుతున్న ప్రాంతాలను గుర్తించామని వాటిపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. మాదకద్రవ్యాలు వినియోగించే విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. కళాశాలల్లో వైద్యులు, మానసిక వైద్యులు, పోలీసులు, రాజకీయ నాయకులు, కళాశాల అధ్యాపకులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో తల్లిదండ్రులను భాగస్వామ్యులను చేస్తామని చెప్పారు. కళాశాలల్లో, పాఠశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కమిటీలో పోలీసులు, విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు ఉంటారన్నారు. జోన్–2 పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి, డ్రగ్స్‌ను 100 రోజుల్లో నిరోధిస్తామని తెలిపారు. గంజాయి ట్రాన్స్ పోర్టును నిరోధించేందుకు సరిపల్లి వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేశామని, ఇది 24 గంటలు పని చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. జోన్ పరిధిలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణాకు చెందిన 339 కేసులు అండర్ ట్రైల్స్‌లో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో ఏసీపీలు అన్నెపు నరసింహ మూర్తి, బి.మోసెస్ పాల్, జోన్–2 పరిధిలో సీఐలు పాల్గొన్నారు.

కనుల పండువగా కుంచుమాంబ పండగ



ప్రత్యేక అలంకరణలో కుంచుమాంబ అమ్మవారు



ఆలయం వద్ద భక్తుల రద్దీ

సీతంపేట: అక్కయ్యపాలెం గ్రామ దేవత కుంచుమాంబ అమ్మవారి ప్రధాన పండగను మంగళవారం గౌరీ సేవా సంఘం ఘనంగా నిర్వహించింది. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి జలాభిషేకం, కుంకుమపూజలు జరిపించారు. అక్కయ్యపాలెం, కాళ్లవారితోట, రామకృష్ణానగర్, జగన్నాథపురం, శ్రీనివాసనగర్, రామకృష్ణానగర్, మాదేటి గార్డెన్స్, రామచంద్రానగర్ ప్రాంతాలకు చెందిన గవర కులస్తులు, స్థానికులు పెద్ద ఎత్తున అమ్మవారికి పూజలు జరిపారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ పరిసరాలను అలంకరించారు.

ఆకట్టుకున్న ఊరేగింపు

మేళతాళాలు, సంప్రదాయ, సాంస్కృతిక ప్రదర్శనలతో అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలను అక్కయ్యపాలెం పుర వీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు కొబ్బరికాయలు, హారతులతో, ధూపదీపాలతో అమ్మవారికి నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా ఊరేగింపులో ఏర్పాటు చేసిన కోలాటం, తప్పెటగుళ్లు, పులి వేషాలు, గరిడీలు, నేల డ్యాన్సులు, బిందెల డ్యాన్సులు, పూనక డ్యాన్సు, కాంతార, బళ్ల వేషాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్, ఆర్కెస్ట్రాలు వంటి స్టేజి ప్రోగ్రామ్స్ అలరించాయి. పండగలో ఏర్పాటు చేసిన దుకాణాలు వద్ద కొనుగోళ్లతో సందడి నెలకొంది. సంఘం గౌరవ అధ్యక్షులు పాలమరశెట్టి ప్రసాద్, అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి ఆడారి పారుపల్లి రవి, కోశాధికారి పెంటకోట సత్య ప్రసాద్, ఉత్సవకమిటీ చైర్మన్ రాజగిరి సింహాచలం, వైస్ చైర్మన్ మళ్ల త్రినాథరావు, ఆడిటర్ పెంటకోట సత్యనారాయణ, డిప్యూటీ ప్రెసిడెంట్ పిల్లా పకీరు నాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని ఏఎన్‌ఎంల ధర్నా



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్‌ఎంలు

మహారాణిపేట : వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ఏఎన్‌ఎంలు ఆందోళనకు దిగారు. సమస్యలు పరిష్కారించాలని కోరుతూ ఏఎన్ఎంలు నినాదాలు చేశారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న నాయకులతో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు చర్చలు జరిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, ఆందోళన విరమించాలని యూనియన్ నాయకులను డీఎంహెచ్‌వో కోరారు. అయినా ఏఎన్ఎంలు ఆందోళన కొనసాగించారు. బీసీజీ వ్యాక్సినేషన్‌ను రెండు రోజుల నుంచి తగ్గించాలని, యూనిఫారాల అలవెన్స్ ఇవ్వాలని, సెలవుల్లో కోత విధించరాదని, సచివాలయ ఏఎన్‌ఎంలపై పని ఒత్తిడి తగ్గించంచాలని, సెలవుల్లో కూడా విధులు నిర్వహించవలసి వస్తుందని నాయకురాలు మణి తెలిపారు. అధికారుల ఒత్తిడి అధికంగా ఉందంటూ ఆందోళన కొనసాగించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విశాఖపట్నంకు చెందిన భక్తులు మంగళవారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. విశాఖపట్నం శివాజీపాలెంకు చెందిన సాధనాల హిమవర్షిణి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, ఆలయ అర్చకులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

కారును ఢీకొన్న లారీ డ్రైవర్‌పై కేసు

పీఎం పాలెం : కారుషెడ్ కూడలి సిగ్నల్ పాయింట్ వద్ద ఆగి ఉన్న కారును ఢీకొట్టిన లారీ డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని పాత డెయిరీ ఫారం ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఇషాక్ విజయనగరం నుంచి విశాఖకు సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో వస్తుండగా కారుషెడ్ కూడలి వద్ద అదే రోడ్డులో వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో కారుకు బాగా డ్యామేజ్ అయింది. బాధితుని ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఎమ్మెల్యే వెలగపూడికి అభినందన



వెలగపూడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఈడీ

ఎంవీపీ కాలనీ: విశాఖ తూర్పు ఎమ్మెల్యేగా మరోసారి గెలుపొందిన వెలగపూడి రామకృష్ణబాబుకు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ అభినందనలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలు వెల్లడించారు. దీంతో పాటు దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను సైతం ఆమె కలిసి అభినందనలు తెలియజేశారు.

ప్రతిభకు వైకల్యం అడ్డురాదు



పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న మణి మేకలై

కొమ్మాది : అంధత్వం ఉన్న అందరిలోనూ మిన్నగా అంధబాలికలు ప్రతిభా పాటవాలు చూపిస్తున్నారని యూనియన్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో మణి మేకలై అన్నారు. బీచ్‌రోడ్డు సాగర్‌నగర్‌లో గల ప్రభుత్వ అంధ బాలికల పాఠశాలకు యూనియన్ బ్యాంక్ ఆర్థిక సహకారంతో 2 ఏసీలు, ఒక బీరువా, బ్రెయిలీ రీడర్స్, స్పోర్ట్స్ దుస్తులు, మంగళవారం ఆమె అందజేశారు. విద్యార్థినులు ఆత్మస్థైర్యంతో, సంకల్పంతో విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

ప్రమాదానికి కారకుడైన కారు డ్రైవర్‌పై కేసు

పీఎం పాలెం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని రుషికొండ ఏ 1 కన్వెన్షన్ వద్ద నిర్లక్ష్యంగా కారు నడిపి ఓ వ్యక్తిని తీవ్రంగా గాయపరిచిన కారు డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 11న సాగర్‌నగర్ వైపు నుంచి తగరపువలసకు కారులో వెళ్తున్న మోహన్ రెడ్డి రుషికొండ ఏ1 కన్వెన్షన్ సమీపంలోకి రాగానే అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో మరో రోడ్డు వైపునకు కారు మళ్లింది. ఆ సమయంలో ఆ రోడ్డులో వెళ్తున్న పి.కార్తీక్ అనే వ్యక్తిని బలంగా ఢీకొట్టడంతో పక్కటెముకు విరిగిపోయింది. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.